ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
మంగళవారం 20 ఫిబ్రవరి 2024



ఏప్రిల్ 23న చారిత్రాత్మక కరగ శక్తిఉత్సవం

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో చారిత్రాత్మకంగా సాగే కరగ ఉత్సవాలు ఏప్రిల్ 15నుంచి 23వ తేదీ దాకా జరుగుతాయని ధర్మరాయస్వామి ఆలయ కమిటీ ప్రకటించింది. 23న కరగ శక్తిఉత్సవం జరగనుంది. ధర్మరాయ స్వామి ఆలయం నుంచి అదే రోజున రాత్రి ప్రారంభమయ్యే కరగ ఉత్సవం మరుసటి రోజుదాకా కొనసాగనుంది. ఈ ఏడాది కూడా అర్చకుడు జ్ఞానేంద్ర కరగను మోయనున్నారు. ఇలా జ్ఞానేంద్ర కరగ మోయడం 14వ సారి కానుంది. ధర్మరాయస్వామి ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయశాఖ ముఖ్యులు నిర్వహించిన సమావేశంలో కరగను జ్ఞానేంద్ర మోసేలా నిర్ణయించారు.



రెసిడెన్షియల్ స్కూల్లో కొత్త సూక్తి

అసెంబ్లీని కుదిపేసిన సూక్తి



రెసిడెన్షియల్ స్కూల్లో పాత సూక్తి

- రెసిడెన్షియల్ స్కూళ్లలో కువెంపు సూక్తిలో మార్పు ● నిలదీసిన ప్రతిపక్షాలు ● జాతీయ కవిని అవమానించారని ఆగ్రహం ● ప్రశ్నించమంటే తప్పేమిటి..? : డీసీఎం

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గుట్టు చప్పుడు కాకుండా రెసిడెన్షియల్ స్కూళ్లలో సూక్తి మారింది. అనూహ్యంగా ఈ విషయం ఆదివారం తెరపైకి రావడంతో సోమవారం అసెంబ్లీ అట్టుడికింది. రాష్ట్రంలోని రెసిడెన్షియల్ స్కూళ్లలో 'జ్ఞాన దేగులవిదు కై ముగిదు ఒళగె బన్ని' అనే సూక్తి ఉండేది. 'జ్ఞానాన్ని బోధించే ఆలయమిది చేతులు జోడించి రండి' అనే అర్థం వచ్చేది. రెండు మూడు వారాల వ్యవధిలో దాదాపు అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లలోనూ 'జ్ఞానదేగులవిదు ధైర్యవాగి ప్రశ్నిసి' అని మార్పు చేశారు. 'జ్ఞానాన్ని బోధించే ఆలయమిది ధైర్యంగా ప్రశ్నించండి' అని అర్థం వస్తుంది. ఇంతకు ముందు జాతీయకవి కువెంపు పద్యంలోని వాక్యాలను విద్యాసంస్థలలో ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ వాక్యాలను మార్పుచేశారు. ఉపాధ్యాయులకు ఇష్టం ఉన్నా లేకున్నా అమలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే పలు విద్యాసంస్థల్లో మార్చారు. సాంఘిక సంక్షేమశాఖ అధికారులు ఏ ఉద్దేశ్యంతో మార్పు చేశారో అంతుబట్టడం లేదు. ఉన్నతాధికారుల మౌఖిక సూచనలతోనే సూక్తిని మార్చారు. రాష్ట్రంలో జనరల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఏకలవ్యతో కలిపి 833 రెసిడెన్షియల్ స్కూళ్లు ఉన్నాయి. వేలాదిమంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. ఒక్కసారిగా సూక్తి మార్పు ఎందుకు జరిగిందనేది విద్యార్థులలో చర్చకు వచ్చినా సమాధానం చెప్పేవారు లేరు. రెసిడెన్షియల్ స్కూళ్లలో జాతీయ పర్వదినాలు, నాడహబ్బ, ప్రముఖుల జయంతులు మినహా ధార్మికమైన కార్యక్రమాలు, పూజలు కొనసాగించరాదనే సర్క్యులర్ వచ్చిన వెంటనే సూక్తి మార్పు నిర్ణయం జరిగింది. ఇది సర్వత్రా విమర్శలకు కారణమైంది. ప్రతి విద్యాసంస్థలోనూ ఏడాది చివరన సరస్వతి పూజ చేసే సంప్రదాయం ఉంది. ఇటీవల పలు విద్యాసంస్థల్లో ధార్మికమైన పూజలు చేయడం సరికాదనే ఆదేశాలు జారీ చేశారు. అంతలోనే సూక్తి కూడా మార్చడాన్ని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ తీవ్రంగా మండిపడ్డాయి.

అట్టుడికిన శాసనసభ

విద్యాసంస్థల్లో సూక్తి మార్పుపై శాసనసభలో తీవ్రమైన చర్చ జరిగింది. దీనిపై జీరో అవర్‌లో ప్రతిపక్షనేత ఆర్. అశోక్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కువెంపు రచనలను కూడా మార్పు చేసి అవమానించారంటూ మండిపడ్డారు. చేతులు జోడించి రండి అనేది భారతీయ సంస్కృతి పరంపర అని దాన్ని మార్పు చేయాలనే నిర్ణయం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ మణివణ్ణన్ మార్పు చెందారని, ప్రపంచమే మారాలా..? అంటూ మండిపడ్డారు. ఏ ఉద్దేశ్యంతో సూక్తి మార్చారని ప్రశ్నించారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ దాకా విద్యాసంస్థలను జ్ఞానాన్ని బోధించే ఆలయాలుగా పిలుస్తారని తెలిపారు. కానీ ధైర్యంగా ప్రశ్నించాలనే సూక్తి ఎవరికి వర్తిస్తుందన్నారు. పాఠాలు అర్థం కాకుంటే ఉపాధ్యాయుల నుంచి నివృత్తి చేసుకోవచ్చునని, ఇక్కడ ప్రశ్న అనే అంశం ఎందుకొచ్చిందన్నారు. ప్రభుత్వ ఆదేశాలు, మంత్రి ఆదేశాలు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. విధానసౌధ ముందు ప్రభుత్వ విధి - దేవుడి సేవలాంటిదని దశాబ్దాల క్రితమే పొందుపరిచారన్నారు. ఓ అధికారి వచ్చారని మార్పు చేస్తారా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ విదేశీయులు వచ్చినప్పుడు విధానసౌధలోకి చేతులు జోడించి వస్తారని అయినా ఈ కొత్త విధానం ఎందుకు తీసుకొచ్చారని నిలదీశారు. మాజీ సీఎం బసవరాజ్‌బొమ్మై విధానసౌధలో మాట్లాడుతూ ప్రభుత్వం సమాజంలో మార్పులు కోరుతూ తీవ్రమైన పరిణామాలకు కారణమవుతోందని మండిపడ్డారు.

ప్రశ్నించమంటే తప్పేమిటి..? : డీసీఎం

సమాజంలో జరిగే ప్రతి అంశానికి తప్పులు వెతకడమే బీజేపీ విధిగా మారిందని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. కువెంపు రచనలు మార్పు చేయలేదని, ధైర్యంగా ప్రశ్నించడంలో తప్పేముందన్నారు. కువెంపు ఆలోచనలు అమలు చేశామని 'సర్వజనాంగద శాంతియ తోట'గా మార్చామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మహదేవప్ప స్పందిస్తూ కువెంపు రచన మార్పు జరగలేదన్నారు. ప్రశ్నించడమనేది రాజ్యాంగపరమైన హక్కు అన్నారు. ఎవరైనా ప్రశ్నించవచ్చునని ఇందులో తప్పు ఎక్కడ ఉందో తెలియదన్నారు. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ప్రియాంకఖర్గే విధానసౌధ బయట మీడియాతో మాట్లాడుతూ గతంలో ఎన్నో రచనలు మార్పు జరిగాయన్నారు. ప్రస్తుతం కువెంపు రచనల్లో మార్పు జరిగితే తప్పేం ఉందన్నారు. ప్రశ్నించే హక్కు అందరికీ ఉందని, అది బాల్యం నుంచే పెంపొందించే ప్రయత్నమేనని పేర్కొన్నారు. పిల్లలు, ఉపాధ్యాయులు మరికొంత నేర్చుకుంటారని, తాము ఎటువంటి తప్పు చేయలేదన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లు జ్ఞాన కేంద్రాలు కావాలనేది తమ ఆశయం అన్నారు. విద్యాసంస్థల్లో సూక్తి మార్పుపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి మండిపడ్డారు. హుబ్బళ్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నీచమైన విధానాలకు పరమావధి అని మండిపడ్డారు. జాతీయకవి కువెంపును అవమానించారని పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత ఆర్. అశోక్


సమావేశంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు


శివాజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న సీఎం సిద్దరామయ్య

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి రాజధాని బెంగళూరు సహా రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. బెంగళూరు రవీంద్రకళాక్షేత్రలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య హాజరయ్యారు. కర్ణాటక మరాఠా సముదాయాల అభివృద్ధి కార్పొరేషన్, కన్నడ సాంస్కృతిక శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గోసాయి మహాసంస్థాన మఠాధిపతి మంజునాథ భారతిస్వామి సారథ్యం వహించారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ ఛత్రపతి శివాజీ దేశభక్తికి, వీరత్వానికి ప్రతీకగా ఉన్నారని కొనియాడారు. దేశ ప్రజల్లో ఐక్యత బోధిస్తూనే తన సామ్రాజ్యంలో అన్ని వర్గాలకు సముచిత గౌరవం కల్పించేవారన్నారు. మరాఠా కార్పొరేషన్ తరపున పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య చెక్కులను పంపిణీ చేశారు. కన్నడ సాంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడగి, మాజీ మంత్రి పీజీఆర్ సింధ్యా, ఎమ్మెల్యే శ్రీనివాస్‌మానెతోపాటు మరాఠా సముదాయానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మతమార్పిడి ఆపకపోతే తరిమికొడతాం

- శ్రీరామ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు ముతాలిక్ హెచ్చరిక



బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మతమార్పిడులను వెంటనే ఆపాలని, లేదంటే ప్రయత్నించేవారిని తరిమికొట్టాల్సి ఉంటుందని శ్రీరామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రమోద్ ముతాలిక్ హెచ్చరించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 3,600 లంబాడీ తండాలు ఉన్నాయని, వారి అమాయకత్వాన్ని సొమ్ము చేసుకునేలా మతమార్పిడి కుట్ర సాగుతోందన్నారు. మీ కార్యక్రమాలు ఇళ్ల వద్ద చేసుకోవాలన్నారు. శ్రీరామసేన ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తామని, వారు రంగంలోకి దిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. హిందువులలోని పేదవర్గాలకు చెందిన తండా ప్రజలు, నిరక్షరాస్యులకు లేని ఆశలు చూపి మతమార్పిడిలు చేయరాదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలో మార్పు తీసుకొస్తున్నారన్నారు. 2014 ముందు ప్రధానమంత్రులు దర్గాలు, చర్చిలకు వెళ్లేవారని, కానీ నుదుట విభూతి రాసి ఆలయాలకు వెళ్లిన ప్రధాని నరేంద్రమోదీ మాత్రమే అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎన్డీయేకు 400 స్థానాలు సాధ్యమని అప్పుడు సంపూర్ణ హిందూదేశం ఏర్పడనుందన్నారు. రామమందిరం స్థాపిస్తామని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బడ్జెట్‌లో ఒక రూపాయి కూడా గ్రాంటు కేటాయించలేదని, క్రైస్తవులు, ముస్లింలకు కోట్లాది రూపాయలు కేటాయించారన్నారు.


బీఎంటీసీ సిబ్బందికి కోటి ప్రమాద బీమా

- రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి వెల్లడి

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (కేఎస్ఆర్టీసీ) సిబ్బందికి అమలు చేస్తున్న రూ.కోటి ప్రమాద బీమా సదుపాయాన్ని బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (బీఎంటీసీ) సిబ్బందికి కూడా వర్తింపజేస్తూ రవాణా శాఖ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి ఆర్. రామలింగారెడ్డి నగరంలో మీడియాతో మాట్లాడుతూ ఈ ఆదేశాలు తక్షణం అమల్లోకి వచ్చాయని, ఫలితంగా బీఎంటీసీలో 28వేల మంది సిబ్బందికి లబ్ధి చేకూరనుందని తెలిపారు. ఇంతవరకు ప్రమాదాల్లో బీఎంటీసీలో ప్రమాదాల బారిన పడి సిబ్బంది చనిపోతే రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించేవారు. ఈ మొత్తాన్ని ఏకంగా కోటిరూపాయలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఆర్టీసీ కార్మికుల యూనియన్ హర్షం వ్యక్తం చేస్తోంది. విధినిర్వహణలో ఉన్నా లేకపోయినా బీఎంటీసీలో పనిచేసే సిబ్బంది ఒక వేళ ప్రమాదంలో మృతి చెందితే కోటిరూపాలకు పైగా పరిహారం దక్కుతుంది. ఒక వేళ సిబ్బంది సహజమరణం పొందినా ఆధారపడ్డ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందిస్తున్నామని మంత్రి రామలింగారెడ్డి వెల్లడించారు. కాగా రాష్ట్రంలో మొత్తం నాలుగు ఆర్టీసీ కార్పొరేషన్లకు కలిపి 5,800 నూతన బస్సులను కొనుగోలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో 1000 బస్సుల కొనుగోలు ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించామని మార్చిచివరి నాటికి 5వేల బస్సులను కొనుగోలు చేస్తామని మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకోసం మరిన్ని బస్సులను ప్రవేశపెట్టనున్నామని మంత్రి వెల్లడించారు.

- రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి

ఆలయాల నిధులన్నీ అభివృద్ధికే...



ఆలయాల నిధులను, హుండీ డబ్బులను మైనార్టీల కోసం తరలిస్తున్నట్లు సోషల్ మీడియాలో గత కొద్దిరోజులుగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని దేవదాయ శాఖ మంత్రి కూడా అయిన రామలింగారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇవి పూర్తిగా నిరాధార కథనాలన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో కంటే తమ హయాంలో ఆలయాల అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. శక్తి పథకం పుణ్యమా అని రాష్ట్ర వ్యాప్తంగా మహిళల ఉచిత ప్రయాణంతో ఆలయాలు, పుణ్యక్షేత్రాలు కళకళలాడుతున్నాయని తెలిపారు. సోషల్ మీడియాలో ఇలాంటి తప్పుడు కథనాలను ప్రసారం చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కావాలనే ఇలాంటి వదంతుల్ని వ్యాపింపజేస్తున్నారని ఆయన విమర్శించారు. ఆలయాలకు వచ్చే నిధులు, హుండీలలో భక్తులు వేసే కానుకలు పూర్తిగా భక్తుల సౌకర్యాల కోసం ఆలయాల అభివృద్ధికోసమే వినియోగిస్తామని, ఈ విషయంలో వదంతులను నమ్మవద్దని ఆయన భక్తులకు విజ్ఞప్తి చేశారు.

యూనివర్సిటీల్లో మార్కులకు బదులు గ్రేడింగ్‌లు

- గౌరవ డాక్టరేట్‌లపైనా నిబంధనలు రూపొందిస్తాం
- ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్


పరిషత్‌లో ప్రసంగిస్తున్న మంత్రి సుధాకర్

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలలో మార్కులకు బదులుగా గ్రేడింగ్‌లు ఇచ్చే ప్రతిపాదన పరిశీలిస్తామని ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ తెలిపారు. విధానపరిషత్‌లో సోమవారం కాంగ్రెస్ సభ్యుడు మంజునాథ్‌భండారీ మాట్లాడుతూ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో మార్కుల కేటాయింపులో వ్యత్యాసం ఉందని, తద్వారా విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. మంగళూరు యూనివర్సిటీ తరహాలో ఇతర విశ్వవిద్యాలయాల్లో మార్కులు ఇవ్వరనే అంశంపై మాట్లాడారు. మంత్రి సుధాకర్ వివరణ ఇస్తూ రాష్ట్రంలో ప్రైవేట్ యూనివర్సిటీలు పెరుగుతున్నాయని, వారే పరీక్షలు నిర్వహించుకుంటారని వివరించారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఆర్థిక సంక్లిష్ట పరిస్థితిలో ఉన్నాయని అన్నారు. వెంటనే అమలు చేయాలంటే సమస్యలు తలెత్తుతాయన్నారు. మార్కులు బదులుగా గ్రేడింగ్‌లు ఇచ్చే అంశం కూడా పరిశీలిస్తామన్నారు. గౌరవ డాక్టరేట్ ఇచ్చేందుకు నిబంధనలు ఉన్నాయన్నారు. డాక్టరేట్లు పొందినవారు పేరుకు ముందు డాక్టర్‌గా రాసుకోరాదని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా కౌన్సిల్ ద్వారా గౌరవ డాక్టరేట్ ఇచ్చేలా నిబంధనలు తీసుకువస్తామన్నారు. ప్రైవేట్‌తో పాటు అన్ని విశ్వవిద్యాలయాలకు ఏకరూప నిబంధనలు తీసుకువస్తామన్నారు.

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల నియామకాలకు ఒకే నిబంధన

రాష్ట్రంలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకాలకు ఒకే నిబంధన తీసుకువస్తామని ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప తెలిపారు. పరిషత్‌లో జేడీఎస్ సభ్యుడు మరితిబ్బేగౌడ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ 2016 నుంచి ఇప్పటి దాకా పదవీ విరమణ పొందిన, రాజీనామాలు చేసిన ఉపాధ్యాయుల వివరాల ద్వారా ఖాళీ పోస్టులను గుర్తించి నియామకాలు చేస్తామన్నారు. ముఖ్యమంత్రితో చర్చలు జరిపి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు.

రాష్ట్రంలో విమాన మరమ్మతుల ప్రాజెక్టు

- రూ.2,300 కోట్లతో ఏర్పాటు ● సీఎం సమక్షంలో ఒప్పందాలు

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విమానాల నిర్వహణ, మరమ్మతుల ప్రాజెక్టు రాష్ట్రంలో ఏర్పాటు కానుంది. సచివాలయంలో సోమవారం దీంతోపాటు పలు కీలక ఒప్పందాలపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య సమక్షంలో సంతకాలు చేశారు. టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియా, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ రూ.2,300 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఒప్పంద కార్యక్రమంలో భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్, పరిశ్రమలశాఖ ప్రధాన కార్యదర్శి సెల్వకుమార్, ఎయిరిండియా ముఖ్య వాణిజ్య వ్యవహారాల అధికారి నిపుణ్ అగర్వాల్, టీఏఎస్ఎల్ సీఈఓ సుకరణ్‌సింగ్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందాల అనంతరం భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ మీడియాతో మాట్లాడారు. టాటా గ్రూప్ పెట్టుబడులతో 1,650 ఉద్యోగాల సృష్టి జరగనుందన్నారు. ఇందులో ఎయిరిండియా కంపెనీ బెంగళూరు దేవనహళ్లిలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల నిర్వహణ, మరమ్మతుల ఓవర్‌హాల్ (ఎంఆర్ఓ)ను రూ.1300కోట్లతో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో 1200 మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. పరోక్షంగా మరో 25వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ మూడు ప్రత్యేక ప్రాజెక్టులలో కలిపి రూ.1,030 కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టనుందన్నారు. ఇందులో రూ.420 కోట్ల సరుకు రవాణా విమానాల విభాగం కూడా ఉంటుందని వివరించారు. రూ.300 కోట్లతో తుపాకుల తయారీ, రూ.300 కోట్లతో విమానయాన రక్షణ, పరిశోధనా అభివృద్ధి విభాగాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. బెంగళూరు ఎయిర్‌పోర్టుకు సమీపంలోని కోలారులో తుపాకుల తయారీ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. తుపాకుల తయారీకి అవసరమైన విడిభాగాల్లో 50 శాతాన్ని ఈ ప్లాంట్‌లోనే తయారు చేస్తారని పేర్కొన్నారు. ఫలితంగా మరో 350 మంది నిపుణులు, 3వేల మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రక్షణశాఖకు అవసరమైన విమానాలు, హెలికాప్టర్లలో 67 శాతం కర్ణాటకలోనే తయారవుతున్నాయని ఆయన వివరించారు. మొత్తం దేశ అవసరాలలో 65 శాతాన్ని కర్ణాటక అందిస్తోందన్నారు. వైమానిక రంగంలో సేవలందిస్తున్న కంపెనీలలో 70 శాతం కర్ణాటకలోనే ఉన్నాయని అన్నారు. ఈ ఒప్పందాలు పౌర విమాన, రక్షణ రంగాలకు సంబంధించినంత వరకు అత్యంత కీలకమైనవన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి రజనీశ్ గోయెల్, ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి ఎల్‌కే అతీక్, పరిశ్రమలశాఖ కమిషనర్ గుంజన్‌కృష్ణన్, ఎయిరిండియా ఉన్నతాధికారులు మనస్ చౌహాన్, కార్తికేయ భట్, అతుల్ శుక్లా, టీఏఎస్ఎల్ ఉన్నతాధికారులు గురుదత్తాత్రేయ, అర్జున్ మైనే, బెంగళూరు దేవనహళ్లి అంతర్జాతీయ విమానాశ్రయ మేనేజింగ్ డైరెక్టర్ హరిమారార్, సీఓఓ సాత్యకి రఘునాథ్, సీఎఫ్ఓ భాస్కర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.


సీఎం సమక్షంలో ఒప్పందపత్రాల మార్పు

బెంగళూరులో జార్ఖండ్ ఎమ్మెల్యేల క్యాంప్..?

- 12 మంది ఎమ్మెల్యేల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జేఎంఎం, కాంగ్రెస్ మైత్రితో ఏర్పడిన జార్ఖండ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి చంపైసోరెన్ మంత్రివర్గ విస్తరణకు ముందే వ్యతిరేకతను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. మాజీ సీఎం హేమంత్ సోరెన్ కేబినెట్‌లో ఉన్న కాంగ్రెస్‌కు చెందిన నలుగురు మంత్రులను ప్రస్తుత సీఎం కేబినెట్‌లోను కొనసాగించారు. ఈ నలుగురు మంత్రులూ ఎమ్మెల్యేల సమస్యలు పట్టించుకోవడం లేదని ఇతరులు వ్యతిరేకిస్తున్నారు. అధిష్ఠానం లేదా సీఎంపై ఎటువంటి కోపం లేదని మిగిలిన ఎమ్మెల్యేలు బహిరంగంగా ప్రకటించారు. కాంగ్రెస్‌కు చెందిన నలుగురు మంత్రులను మార్పు చేయాల్సిందేనని లేదంటే 12 మంది తడాఖా చూపతామని హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు సమస్య వివరించాలని వారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బెంగళూరుకు తీసుకురావాలని పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే డీసీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌కు సూచించినట్లు సమాచారం. అదే జరిగితే జార్ఖండ్‌కు చెందిన 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బెంగళూరుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. గతంలో గుజరాత్ రాజ్యసభ ఎన్నికల వేళ కూడా బెంగళూరులోనే ఎమ్మెల్యేల క్యాంప్ సాగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కర్ణాటకలో పటిష్ఠమైన కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటంతో పార్టీ సంక్షోభాలను ఇక్కడి నుంచే పరిష్కరించే ఆలోచనలో అగ్రనేతలు ఉన్నారు. బెంగళూరుకు రానిపక్షంలో రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు వెళ్లే అవకాశం కూడా ఉంది. బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న తరుణంలో ఎమ్మెల్యేలు గైర్హాజరయితే ప్రభుత్వం కూలిపోయే అవకాశం ఉంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యతిరేకతతో ఇప్పటికే రెండుసార్లు మంత్రివర్గ విస్తరణ వాయిదా పడింది.





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1587.77	1,609.67
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	165	8,682
సామర్థ్యం (టీఎంసీలు)	9.27	36.93

కోటే మల్లేశ్వర స్వామి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు: మంత్రి నాగేంద్ర

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 19: నగర ఆరాధ్యదైవం కోటే మల్లేశ్వర స్వామి దేవస్థానం జాతర మహారథోత్సవ ముందస్తు సమావేశం సోమవారం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బి.నాగేంద్ర నేతృత్వంలో స్వామి వారి ఆలయంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏటా నిర్వహించిన తరహాలోనే కోటే మల్లేశ్వర స్వామి జాతర మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని, లక్షలాది మంది భక్తుల రాకను దృష్టిలో ఏర్పాట్లు ఘనంగా చేపడతామన్నారు. ఆలయంలోపల, వెలుపల ధార్మిక కార్యక్రమాలతోపాటు రవాణా ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. మేయర్ శ్వేత, జిల్లాకలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎస్పీ రంజిత్ కుమార్ బండారు, కార్యనిర్వహణాధికారి హనుమంతప్ప పాల్గొన్నారు.





బళ్లారిలో ఛత్రపతి శివాజీకి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి , గంగావతి తహసీల్దార్ కార్యాలయంలో..సిరుగుప్ప పట్టణ సభ కార్యాలయంలో అధికారుల నివాళి

సాహో ఛత్రపతి..

● జిల్లావ్యాప్తంగా శివాజీ జయంతి వేడుకలు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 19: అసమాన్య ధైర్య సాహసాలకు పేరొందిన వీరుడు, హిందూ ధర్మ పరిరక్షకుడిగా పేరొందిన ఛత్రపతి శివాజీ జయంతిని సోమవారం నగరంలోని పాండురంగ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నగర మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ సభ్యుడు గోవిందరాజులు, వీరశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ మోత్కార్, మరాఠ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గంగావతి, రూరల్: ఛత్రపతి శివాజీ జయంతిని అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. కొప్పళ జిల్లాలోని ఆర్‌టీఓ కార్యాలయంలో శివాజీ జయంతి ఆచరణ సూపరింటెండెంట్, ప్రసాద్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. ఛత్రపతి శివాజీ చేసిన సేవలను ప్రజలకు తెలియచేస్తూ ఆయనమార్గంలో నడవాలని సూచించారు. ఈసందర్భంగా నరసప్ప, సిద్దేశ్, సిద్ధరామప్ప, రంజిత్, గిరీశ్, శైల, ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తహసిల్దార్ కార్యాలయంలో

పట్టణంలోని తహసీల్దార్ కార్యాయంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధికారులు శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మంజునాథ్, శ్రీనివాస్, మహంతేశ్, శివరాజ్, క్రిష్ణగౌడ, అనుసూయ, సునితా పాల్గొన్నారు.

సిరుగుప్పలో..

సిరుగుప్ప : ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను సిరుగుప్ప పట్టణ పట్టణసభ కార్యాలయంలో కమిషనర్ గురుప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరసభ కమిషనర్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ ఎంతో పరాక్రమవంతుడని, ఆయన తత్వ సిద్ధాంతాలను అందరూ పాటించాలని కోరారు. హిందూ ధర్మ పరిరక్షణకు ఆయన కృషి మరువలేనిదన్నారు. నగరసభ రెవెన్యూ అధికారులు రాజాబక్షి, వెంకోబ, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు సమాజసేవకులు అబ్దుల్ నబీ పాల్గొన్నారు.



దేవతల ఆభరణాలను దోచుకెళ్లిన దొంగలు

ఒకేరోజు మూడు ఆలయాల్లో చోరీ..!

రాయచూరు, ఫిబ్రవరి 19 : జిల్లాలోని సింధనూరు తాలూకా గోరేబాళ క్యాంప్‌లో ఒకే రోజు మూడు దేవాలయాల్లో దొంగతనం జరిగింది. ఆదివారం అర్ధరాత్రి క్యాంపులోని దేవాలయాల్లోకి ప్రవేశించిన దుండగులు దేవతామూర్తులపై ఉన్న బంగారు ఆభరణాలతోపాటు ఆలయాల్లోని హుండీలను ధ్వంసం చేసి నగదును దోచుకెళ్లారు. సీతారామాంజనేయ దేవస్థానంలో సీతాదేవి విగ్రహ మూర్తి పై ఉన్న బంగారు నగలను, హనుమాన్ ఆలయం, తాయమ్మ దేవస్థానంలో హుండీని దొచుకెళ్లగా ఆ హుండీలో దాదాపు రూ.30 వేలకు పైగా ఉండవచ్చని భక్తులు, ఆలయ కమిటీ వారు అంచనా వేశారు. దీంతో పాటు మరళసిద్దేశ్వర మఠంలోకి వెళ్లిన దొంగలు మఠంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన హుండీని ధ్వసం చేసి నగదును ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న సింధనూరు రూరల్ పోలీసులు సోమవారం సంఘటన స్థలాలను పరిశీలించి కేసు నమోదు చేశారు.



ధ్వంసం చేసిన హుండీ

భక్తిశ్రద్ధలతో మధ్వనవమి



బళ్లారి సిటీ, ఫిబ్రవరి 19: ద్వైతసిద్ధాంత ప్రతిపాదకులు, భక్తిపంతులు, మధ్వాచార్యులు వాయుదేవుని అవతారంగా బదరీకాశ్రమంలో ప్రవేశించిన రోజును మధ్వనవమిగా జరుపుకుంటారని పండిట్ జయసింహచార్యులు తెలిపారు. నగరంలోని రేడియోపార్కు శ్రీవ్యాసరాజ మఠంలో ఆయన అనుచరులు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మధ్వాచార్యుల విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి వెండి రథంలో ఉంచి మఠం ఆవరణలో రథోత్సవాన్ని నిర్వహించారు. ప్రధాన వీదుల్లో మధ్వాచార్యుల చిత్రపటం ఊరేగింపు, కీర్తనలు ఆలపించారు. పంచ బృందావనాలకు పంచామృతాభిషేకం నిర్వహించారు. పంచబృందావనాలను వెండితో కప్పి, వివిధ పుష్పాలతో అలంకరించారు. ఉదయం వాయుస్తుతి, వెంకటేశ్వర స్వామి స్తోత్రం, శ్రీ రాఘవేంద్ర స్వామి వారి అష్టోత్తర పారాయణం నిర్వహించారు. మఠం ఆచార్యులు పాండురంగచ్చయ్య, అరళికట్ట శ్రీనివాసచార్యులు పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీవ్యాసరాజ భజన మండలి, చంద్రికాచాయ మండలి భజన నిర్వహించారు.

గోశాల ఏర్పాటుకు భూమిపూజ

కంప్లి, ఫిబ్రవరి 19 : గోశాల నిర్మాణానికి ప్రముఖులు భూమిపూజ నిర్వహించారు. దేవసముద్రం క్రాస్ వద్ద కళ్యాణచౌకిన మఠం ద్వారా సోమవారం అభినవ సిద్దలింగ శివాచార్య స్వాములు, కళ్యాణ స్వాములు, భీమేశ్వరయ్యతాత, బ్రహ్మానంద స్వామి, చెన్నమల్లయ్య, సిద్దలింగ తాత, జగదీష్, వ్యవస్థాపకులు బసవరాజు స్వాముల చేతుల మీదుగా గోశాలకు భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోశాల ఏర్పాటు చేసేందుకు కళ్యాణచౌకి మఠం సేవాట్రస్టు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతి ఒక్కరూ గోశాల అభివృద్ధికి సహకరించాలని, పొలాల్లో రైతులు గోశాలకు మేతను కూడా వితరణ చేయాలని కోరారు. జిల్లాలోని గోశాల అభివృద్ధి చెంది పేరు తీసుకురావాలని కోరారు. కంప్లి తాలుకా పరిధిలో గోశాల లేకపోవడంతో పశువులు చిత్రహింసలకు గురవుతున్నాయని, గోసంరక్షణను దృష్టిలో వుంచుకుని గో శాల ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో దేవసముద్రం, మెట్రి, దేవలాపురం, జానూరు, ఎమ్మిగనూరు, కంప్లి, రామసాగర, ఇతర గ్రామాల నుంచి భారీఎత్తున భక్తులు పాల్గొని విజయవంతం చేపట్టారు.



గోశాల పూజా కార్యక్రమంలో పాల్గొన్న మఠాధిపతులు

వృత్తి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

●జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్

రాయచూరు, ఫిబ్రవరి 19: డిగ్రీ పూర్తి చేసిన యువతి-యువకులతోపాటు నిరుద్యోగుల సౌకర్యం కోసం స్వ చ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన వృత్తి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ సూచించారు. నగరంలోని మహాత్మాగాంధీ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన వృత్తి శిక్షణ కేంద్రాన్ని సోమవారం జిల్లాధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జిల్లాధికారి గతంలో ఇలాంటి శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసిన కార్పోరేట్ సంస్థలు కోవిడ్ అనంతరం యువతి-యువకుల సౌకర్యం కోసం తిరిగి జిల్లా కేంద్రంలో శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వృత్తి విద్యల్లోకి వెళ్లేవారు వివిధ కంపెనీలు నిర్వహించే ఉద్యోగ మేళాల్లో హాజరైయిందుకు సహితం ఈ శిబిరాల్లో శిక్షణ లభిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న డీసీ చంద్రశేఖర్ నాయక్

చెట్టును ఢీ కొట్టిన కారు..ముగ్గురికి గాయాలు

రాయచూరు, ఫిబ్రవరి 19 : డ్రైవర్ నిద్రమత్తు కారణంగా కారు చెట్టుకు ఢీ కొట్టి ముగ్గురు తీవ్ర గాయాలపాలైన సంఘటన జిల్లాలోని లింగసుగూరు పట్టణ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. లింగసుగూరు తాలూకా గురుగుంటా గ్రామానికి చెందిన వ్యాపారులు గురురాజ(26), నవనీత(24)లు ఆదివారం హుబ్లీకి వెళ్లి రాత్రి పొద్దుపోయాక తిరుగు ప్రయాణమైయ్యారు. ఈ క్రమంలో నిద్రమబ్బులో ఉన్న డ్రైవర్ కారును వేగంగా నడుపుతూ అదుపు తప్పడంతో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ పోల్‌ను తొలుత ఢీ కొట్టగా ఆ పోల్ మూడు ముక్కలైనట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. అనంతరం అదే వేగంతో దూసుకెళ్లిన కారు సమీపంలోని చెట్టును ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలైయ్యాయి. లింగసుగూరులో ప్రాథమిక చికిత్సనందించిన క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం బాగలకోట ఆస్పత్రికి తరలించారు. లింగసుగూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. ఐదుగురికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం

చిలమత్తూరు, ఫిబ్రవరి 19: బాగేపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారంతా ఒకే కుటుంబ సభ్యులు. మండలంలోని పాతచామలపల్లికి చెందిన సునందమ్మ, నారాయణరెడ్డిల కుమార్తె వెన్నెల(34), అల్లుడు శివకుమార్ బెంగళూరులో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి కుమార్తె శ్రావణి, కుమారుడు పునీత్ ఉన్నారు. వెన్నెల, శివకుమార్ కుటుం బసమేతంగా ఆదివారం బెంగళూరు నుంచి గోరంట్లలో జరిగిన వివాహానికి హాజరై సొంతూరుకు వెళ్లారు. సోమవారం తెల్లవారుజామున వెన్నెల తల్లి సునందమ్మను, పెద్ద నాన్న చౌడిరెడ్డిని వెంటబెట్టుకొని వారు కారులో బయలుదేరారు. పాతచామలపల్లి నుంచి వీరాపురం మీదుగా జాతీయ రహదారి 44లోకి చేరుకుని, తమ వాహనాన్ని బెంగళూరు వైపు మలుపు తిప్పుతుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. దీంతో ఓ పక్కకు పడిన వాహనం అక్కడ ఉన్న ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వెన్నెల అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె భర్త శివకుమార్, చిన్నారులు పునీత్, శ్రావణి, తల్లి సునందమ్మ, పెద్దనాన్న చౌడిరెడ్డి తీవ్ర గాయాలపాలయ్యారు. కారు నుజ్జునుజ్జు అయిపోయింది. బాగేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన వారి వద్ద ఉన్న 20 తులాల వరకు బంగారం ఆభరణాలను గుర్తు తెలి యని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు వారి కుటుంబ సభ్యులు వాపోయారు. ఒకే కుటుంబానికి చెందిన వారు ప్రమాదానికి గురవడంతో పాతచామలపల్లి విషాదంలో మునిగిపోయింది.

వైభవంగా జోడు రథోత్సవాలు

సిరుగుప్ప, ఫిబ్రవరి 19: శనేశ్వర, నిర్మలానంద స్వామి జోడు రథోత్సవాలు వైభవంగా జరుపుకున్నారు. సిరుగుప్ప తాలుకా పరిధిలో ముదయనూరు, బలకుంది గ్రామాల మధ్య వెలసిన శనేశ్వర, నిర్మానానంద స్వాముల వారి జాతరను ఏటా ఘనంగా నిర్వహిస్తారు. భక్తులు పూలు, పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ప్రధాన అర్చకులు నాగేంద్రస్వామి స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కరాటే భవన్ నిర్మించాలని మంత్రికి వినతి

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 19: నగరంలోని పంచాక్షరి మహర్షియల్ ఆర్ట్స్ ట్రస్ట్ కరాటే, యోగా మెడిటేషన్ శిక్షణను అందిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ కరాటే భవన్‌ను నిర్మించాలని మంత్రినాగేంద్రకు సోమవారం వినతి పత్రం అందించారు. వినతిని స్వీకరించిన మంత్రి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ట్రస్టు నిస్వార్థ సేవలందిస్తోందని, కరాటే భవన్ నిర్మాణానికి క్రీడాశాఖ తరపున సహకారం అందిస్తామన్నారు. ఈసందర్భంగా మేయర్ శ్వేతా, కాంగ్రెస్ ప్రముఖులు జగన్నాథం, ట్రస్టు సభ్యుడు అమరేశ్ తదితరులున్నారు.



మంత్రి నాగేంద్రకు వినతిపత్రం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

అయోధ్యకు భారీగా తరలిన భక్తులు

గుత్తి,పిబ్రవరి19: అయోధ్యకు బాల రాముడి దివ్యదర్శనం కోసం అయోధ్యకు వెళ్లేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి గుత్తి రైల్వే స్టేషన్‌కు భక్తులు చేరుకున్నారు. దాదాపు 195 మంది భక్తులు గుత్తి రైల్వే స్టేషన్‌కు చేరుకుని విజయవాడ నుంచి అయోధ్యకు వెళ్లే ప్రత్యేక రైలులో ఆదివారం రాత్రి తరలివెళ్లారు. స్టేషన్‌కు వచ్చిన భక్తులను స్టేషన్‌మేనేజరు సురేష్‌బాబు ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేశారు.



అయోధ్యకు తరలివెళ్తున్న భక్తులు

హోసూరు జోన్

ఏనుగుల కట్టడికి కార్యాచరణ



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

హోసూరు, ఫిబ్రవరి 19 : హోసూరు వనకోటలో వందకు పైగా ఏనుగులు కొన్ని చోట్ల మకాం వేశాయి. డెంకణీకోట, తళి, ప్రాంతాల్లో ఒంటరి ఏనుగులు ఉండటంతో ప్రజల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. ఏనుగుల నియంత్రణకు హోసూరు ఫారెస్ట్ కన్సర్వేటర్ కార్తికేయని నేతృత్వంలో నాలుగు బృందాలను నియమించి గ్రామాల్లోకి ఏనుగులు రాకుండా కార్యాచరణ చేపట్టారు. పంటలు కోత దశలో ఉన్నాయని, అంచెట్టి, డెంకణీకోట, ఉరిగం, తళి ప్రాంతాల నుంచి ఏనుగులు నీరు, ఆహారం వెదుకుంటూ గ్రామాలపై వస్తున్నాయి. డెంకణీకోట నగరంలోకి రెండురోజులక్రితం ఒక ఏనుగు వచ్చింది. ఆదివారం తళి సమీపంల్లో ఏనుగు దాడిలో ఇద్దరు మహిళలు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. హోసూరు అటవీ ప్రాంతంలో గత 30 రోజుల్లో ఏనుగుల దాడిలో ఐదుగురు మృతి చెందారు. ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మైకుల ద్వారా హెచ్చరిస్తున్నారు.


ఉత్సాహంగా సాంకేతిక సదస్సు

హోసూరు ఫిబ్రవరి 19: హోసూరు ఇంజనీర్ పెరుమాళ్ మణిమేగలై పాలిటెక్నిక్ కళాశాలలో వరుసగా నాలుగురోజుల పాటు జరిగిన జాతీయ సాంకేతిక సదస్సు ఉత్సాహంగా సాగింది. సదస్సులో సివిల్, రోబోటిక్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాలు తొలిరోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. హోసూరు ఇండియా నిప్పన్ ఎలక్ట్రికల్ లిమిటెడ్ సీనియర్ జనరల్ మేనేజర్ శరవణ కుమార్, రిజిస్టర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యదర్శి అరుళ్‌స్వామి, సివిల్ సెక్టార్‌కి సంబంధించి హోసూరులోని ప్రముఖ సివిల్ ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యదర్శి అరుళ్‌స్వామి ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. రెండోరోజు సదస్సులో కంప్యూటర్ ఇంజనీరింగ్, ఈసీఈ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు. బెంగళూరు టెక్ మహేంద్రా మేనేజర్ డాక్టర్ భాస్కర్ రాజగోపాలన్ గౌరవ అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మూడో రోజు సదస్సును టెక్నికల్ సెమినార్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ నిర్వహించింది. ఇందులో టైటాన్ కంపెనీ లిమిటెడ్ ఎంప్లాయ్స్ మేనే జర్ ఎస్ కళ్యాణరామన్ విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కెమికల్ ఇంజనీరింగ్, టూల్ అండ్ డై డిపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో జరిగిన నాలుగో రోజు కార్యక్రమానికి హోసూరు గ్లోబల్ కాల్షియం ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గిరిధర ముఖ్యఅతిథిగా హాజరై ప్రధాన ప్రసంగం చేశారు. నాల్గవ రోజు జాతీయ సాంకేతిక సదస్సుకు పీఎంసీ టెక్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్ కుమార్ అధ్యక్షత వహించారు. విద్యార్థులు తమ ఆలోచనలను వ్యక్తం చేసేందుకు సదస్సులో అవకాశం కల్పించారు. తరగతి గదిలో అకడమిక్ లెర్నింగ్ స్కోర్ చేయడానికి ఉపయోగించబడుతుంది. కానీ సదస్సుల ద్వారా విద్యార్థులలోని ప్రత్యేక ప్రతిభను, సామర్థ్యాన్ని పెంపొందించడానికి దోహదపడేలా చేశాయి. పాఠాలతో పాటు ప్రస్తుత శాస్త్ర సాంకేతిక అభివృద్ధి తెలుసుకునేలా, శిక్షణ పొంది ఉత్తమ ఇంజనీర్లుగా ఎదగాలని సూచించారు. పిఎంసీ టెక్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ మలర్ పిఎంటెక్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకరన్, ఐయూఏసీ కో ఆర్డినేటర్ ఆనంద్, ఎన్‌బీఏ కోఆర్డినేటర్ రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు. సదస్సులో 400 మందికి పైగా విద్యార్థులు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి వివిధ జిల్లాల నుంచి అన్ని విభాగాల అధిపతులు, పాలిటెక్నిక్ కళాశాలల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కంపెనీ ప్రతినిథులు

అంజనాద్రికి రూ.వందకోట్ల కేటాయింపుపై హర్షం



హనుమంతుడు వెలసిన అంజనాద్రి పర్వతం

కంప్లి, ఫిబ్రవరి 19: కిష్కిందలోని అంజనాద్రి పర్వతం అభివృద్ధికి ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.వంద కోట్లు కేటాయించడంపై ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఆంజనేయస్వామిని దర్శించుకునేందుకు దివ్యాంగులు, చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇది హనుమంతుడి జన్మస్థలం కావడంతో దేశ విదేశాల నుంచి ఇక్కడ స్వామివారిని దర్శించుకునేందుకు వస్తున్నారన్నారు. భక్తాదులకు రోప్ సదుపాయం, వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ. వంద కోట్లు మంజూరు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే పనులు ప్రారంభించి, భక్తులు సులభంగా దర్శించుకునే సౌకర్యం కల్పిస్తామన్నారు.

కోటమారియమ్మ కుంభాభిషేకం

హోసూరు(మత్తిగిరి), ఫిబ్రవరి 19: హోసూరు సమీపంలో బాగలూరులో 450 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రసిద్ధి చెందిన కోటమారియమ్మ ఆలయ కుంభాభిషేకం ఘనంగా జరిగింది. శనివారం వినాయక పూజతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండో రోజైన ఆదివారం పంచగవ్య పూజ, ఆచార్య పూజ, నవగ్రహ యాగశాల పూజలు జరిగాయి. ఈ వేదపఠనంలో యాగశాలలోని గంటస్థంభాలపై పంచలోక కళాశాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన రోజైన ఉదయం నుంచి అష్టబంధనం పూజలు, ద్వారపూజలతో పాటు యాగపూజ, యాత్రా అన్నదానం నిర్వహించారు. దీంతో యాగమార్గంలో ఉపవాస దీక్షలో ఉన్న శివాచార్యులు పవిత్రజల కళశాలను తలపై పెట్టుకుని గోపురాల ను అధిరోహించి గోపుర కళశాలపై పవిత్ర జలాలతో మహా కుంభాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. మూ లవిరాట్ అమ్మకు విమాన కళస గోపురం, వినాయక కోట చిన్నమారియమ్మ కళస గోపురం, ధ్వజస్తంభం పూజ, ద్వార పూజ తదితర కార్యక్రమాలతోపాటు యాగపూజ, యాత్రాదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు కళశం నుంచి పవిత్ర జలాన్ని ప్రోక్షణ చేశారు. అనంతరం అమ్మవారికి మహామంగళ హారతి చేసి నైవేద్యాలు సమర్పించారు. ఉత్సవాల్లో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌తోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.



కుంభాభిషేకం చేస్తున్న వేదపండితులు



పార్టీ కండువాలతో స్వాగతిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగరాజ్

బీజేపీలోకి పలువురి చేరిక

హోసూరు(సిఫ్‌కాట్), ఫిబ్రవరి 19: హోసూరు రింగ్ రోడ్డు ఏరియాలోని బీజేపీ పశ్చిమ జిల్లా కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ సమక్షంలో పెద్దసంఖ్యలో కార్యకర్తలు చేరారు. కృష్ణగిరి పశ్చిమ జిల్లా అసెంబ్లీ నియోజకవర్గం తళి సౌత్ యూనియన్ మాడకల్ పంచాయతీ ఆధ్వర్యంలో సుమారు 50 మంది యువకులు బీజేపీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ అందరికి పార్టీ కండువాలతో స్వాగతించారు. ఈ సందర్భంగా రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శ్రీనివాసన్ ఉపాధ్యక్షుడు మురుగన్, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, మహిళా బృందం మంజుళ యూత్ టీమ్ వీరేంద్ర పంచాయతీ ఇన్‌చార్జీ శక్తికృష్ణన్ పాల్గొన్నారు.

వృద్ధురాలికి గాయాలు

కూడేరు, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా కూడేరు మండల పరిధిలోని కడదరకుంట గ్రామంలో చెన్నమ్మ అనే వృద్ధురాలు చీర అంటుకొని గాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాల మేరకు సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో చీర అంటుకోవడంతో గట్టిగా కేకలు వేయగా చుట్టుపక్కల వారు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేయడంతో ప్రమాదం తప్పింది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

శ్రీకంఠదత్త నరసింహరాజ ఒడయార్ (జయంతి)



మైసూరు రాజవంశీయులైన శ్రీకంఠదత్త నరసింహరాజ ఒడయార్ 1953 ఫిబ్రవరి 20న జన్మించారు. మైసూరు సంస్థానానికి చివరి రాజు ఆయనే కావడం విశేషం. మైసూరు పార్లమెంటు నియోజకవర్గం నుంచి సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఫ్యాషన్ రంగంపై ఉన్న ఆసక్తితో మైసూరు పట్టు చీరలను ఇతోధికంగా ప్రోత్సహించారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. మైసూరు దసరా ఉత్సవాలలో నేటికీ సంప్రదాయ ప్రైవేట్ రాజదర్బార్ కొనసాగుతుంది. అనంతరం రాజసింహాసనాన్ని మైసూరు అంబా విలాస్ ప్యాలెస్‌లో భద్రపరుస్తారు. 60వ యేట గుండెపోటుతో ఆయన 2013 డిసెంబరు 10న కన్నుమూశారు.

విజయనిర్మల (జయంతి)



తెలుగు సినీ నటి, దర్శకురాలు విజయనిర్మల 1946 ఫిబ్రవరి 20న నరసారావుపేటలో జన్మించారు. సూపర్‌స్టార్ కృష్ణ భార్య. అసలు పేరు నిర్మల అయితే తనకు సినీరంగంలో తొలి అవకాశం కల్పించిన విజయ స్టూడియోస్‌కు కృతజ్ఞతగా 'విజయ నిర్మల'గా పేరు మార్చుకున్నారు. పాండురంగ మహాత్మ్యంలో బాలనటిగా సినీరంగంలో ప్రవేశించారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి కథానాయికగా ఉన్నత స్థానానికి చేరారు. ప్రపంచంలోనే అత్యధికంగా 44 సినిమాలకు దర్శకత్వం వహించిన మహిళగా 2002లో గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించారు. ఆమె నటించిన అత్యధిక చిత్రాలలో కథానాయకుడు కృష్ణ కావడం ప్రత్యేకత. వీరిద్దరు జంటగా సుమారు 50 సినిమాలలో నటించారు. అక్కా చెల్లెలు, అగ్ని పరీక్ష, పండంటి కాపురం, దేవుడు చేసిన మనుషులు, అల్లూరి సీతారామరాజు, శ్రావణమాసం తదితర సినిమాలు ఉన్నాయి. రఘుపతి వెంకయ్య అవార్డు పొందారు. 2019 జూన్ 27న కన్నుమూశారు.

ఏపీ యువజన కాంగ్రెస్ మీడియా ఇన్‌చార్జిగా అభిషేక్



వీఎస్ అభిషేక్

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల యువజన కాంగ్రెస్ మీడియా ఇన్‌చార్జిగా యువ నేత వీఎస్ అభిషేక్ నియమితులయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేత్రి సోనియాగాంధీ, యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బి.వి.శ్రీనివాస్, యువజన కాంగ్రెస ఇన్‌చార్జి కృష్ణ అల్లవారు సూచన మేరకు ఈ కీలక బాధ్యతలను అప్పగిస్తున్నట్లు యువజన కాంగ్రెస్ జాతీయ మీడియా ఇన్‌చార్జి వరుణ్‌పాండే విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కాగా తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలను అప్పగించిన పార్టీ అగ్రనేతలకు అభిషేక్ సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండు రాష్ట్రాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. ప్రస్తుతం అభిషేక్ యువజన కాంగ్రెస్ జాతీయ మీడియా సమన్వయ కర్తగా ఉన్న సంగతి విదితమే.

వైసీపీ కన్వీనర్లతో బంతాట..!

ఆదుకోమన్నందుకు ఒకరు ఔట్..

మరో ఇద్దరి మార్పునకు రంగం సిద్ధం

హిందూపురం, ఫిబ్రవరి 19: వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వచ్చాక ఆ పార్టీ కన్వీనర్లతో బంతాట అడుతున్నారు. గతంలో ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ఉన్నపుడు నియమించిన కన్వీనర్లను ఒక్కొక్కరినే మార్చుతూ నిర్ణయాలు తీసుకుంటున్నారు. సాధారణంగా ఎన్నికలు సమీపిస్తున్న రోజుల్లో పార్టీ పదవుల జోలికెళ్లడానికి ఎవ్వరూ సాహసించరు. ఎన్నికల సమయంలో పార్టీ పదవులు మార్చితే ఆ ఎఫెక్ట్ ఫలితాలపై పడే అవకాశం ఉంటుంది. ప్రస్తుత సమన్వయకర్త వాటిని పట్టించుకోకుండా మార్చుతుండడంతో అధికార పార్టీలో ఆందోళన మొదలైంది. వైసీపీలో కన్వీనర్ల మార్పు నియోజకవర్గంలో ముఖ్యంగా మైనార్టీల్లో కలకలం రేపింది.


ఆదుకోమన్నందుకు..

ఇటీవల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హిందూపురం పర్యటన సందర్భంగా పట్టణానికి చెందిన మైనార్టీ కార్యకర్త లేపాక్షి మండలంలో జరిగిన సమావేశానికి వెళ్లాడు. అక్కడ అస్వస్థకు లోనయ్యాడు. అయినా మంత్రి గానీ, ముఖ్యనేతలు గానీ పట్టించుకోలేదు. వెంటనే కుటుంబసభ్యులు బెంగళూరు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ కార్యకర్త మృతిచెందాడు. ఇంత జరిగినా సమన్వయకర్తగానీ, ఇతర ముఖ్యనేతలుగానీ ఆ కుటుంబాన్ని పట్టించుకోలేదు. దీంతో పట్టణ ఏ-బ్లాక్ కన్వీనర్‌గా ఉన్న సీపీసీ సాదిక్ ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని.. సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో సమన్వయకర్త వద్ద ఉన్నవారు కొంతమంది కన్నెర్రజేశారు. ఎలాగైనా అతడిని పదవి నుంచి తప్పించాలని పట్టుబట్టారు. అందుకు సమన్వయకర్త భర్త తలూపడంతో అతడిని పక్కన పెట్టి మరొకరికి బాధ్యతలు అప్పగించారు. సాదిక్‌కి పదవి ఇచ్చి మూడు నెలలు కూడా కాలేదు. అప్పుడే పదవిని పీకేశారు. చిలమత్తూరు మండల కన్వీనర్‌ను కూడా మార్చేశారు.

మరో ఇద్దరి మార్పునకు సిద్ధం

నియోజకవర్గంలో ఐదుగురు కన్వీనర్లు ఉండగా.. ముగ్గురిని మార్చారు. మరో ఇద్దరిని కూడా మార్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. లేపాక్షి కన్వీనర్‌ను మార్చాలని మండలంలోని ఓవర్గం పట్టుబట్టింది. ఇప్పటికే పలుదఫాలు సమన్వయకర్తపై ఒత్తిడి తెచ్చారు. ఎన్నికల వరకు కొనసాగించాలని కొందరు కోరుతుండగా.. మెజార్టీ వర్గం మాత్రం అతడిని తప్పించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. దీంతో ఎన్నికలకు ముందో.. తరువాతో.. మార్పు జరగవచ్చు. మరో కన్వీనర్‌ను మార్చేందుకు తీవ్ర పయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఆ కన్వీనర్ విషయంలో తలెత్తుతున్న పరిణామాలను ఆసరాగా తీసుకుని తొలగించాలంటూ ఓ వర్గం గట్టిగా పట్టుబట్టింది. పదవి కోసం పలువురు పోటీ పడుతున్నట్లు సమాచారం. ఎన్నికల సమయంలో కన్వీనర్ల బాధ్యతలు అధికంగా ఉంటాయనీ, ఆర్థికపరమైన అంశాలు కూడుకుని ఉంటాయి కాబట్టి వాటి కోసం డిమాండ్ పెరిగింది. ఏది ఏమైనా హిందూపురం నియోజకవర్గంలో వైసీపీ ముఖ్యనేతలు.. మండల కన్వీనర్లతో బంతాట ఆడుతున్నారని ఆ పార్టీ వారే బహిరంగంగా చెప్పుకుంటున్నారు.

బీజేపీలో చేరికకు శివశంకరరెడ్డి సన్నద్ధం



మాజీ మంత్రి శివశంకర రెడ్డి

▸▸ చిక్కబళ్లాపుర లోక్‌సభ టిక్కెట్ కోసం యత్నం

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రమాజీ మంత్రి, గౌరిబిదనూరు సీనియర్ కాంగ్రెస్ నేత ఎన్‌హెచ్ శివశంకరరెడ్డి బీజేపీ తీర్థం పుచ్చుకునే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చిక్కబళ్ళాపుర నుంచి లోక్‌సభ టిక్కెట్ కోసం గట్టిగానే ప్రయత్నిస్తున్న ఆయన ఒకవేళ టిక్కెట్ లభించకపోతే బీజేపీలో చేరే అవకాశాలే అధికమని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గం కాంగ్రెస్ టిక్కెట్ కోసం మాజీ ముఖ్యమంత్రి ఎం వీరప్ప మొయిలీతోపాటు యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రక్షారామయ్య కూడా తీవ్రంగానే ప్రయత్నిస్తున్నారు. రక్షారామయ్యకు దాదాపుగా టిక్కెట్ ఖరారైనట్లు కూడా కథనాలు వినిపిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ అభ్యర్థుల జాబితా విడుదలయ్యాకే శివ శంకరరెడ్డి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. బీజేపీ నేతలు ఇప్పటికే శివ శంకరరెడ్డితో టచ్‌లో ఉన్నట్లు సమాచారం. గౌరిబిదనూరులో శివశంకర రెడ్డి ప్రత్యర్థిగా ఉన్న కెహెచ్ పుట్టస్వామి ఇటీవల ఒక ప్రకటన విడుదల చేస్తూ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తాను కాంగ్రెస్‌కు మద్దతునివ్వనున్నట్లు ప్రకటించిన తర్వాత నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు శరవేగంగా మారిపోతున్నాయి. ఇప్పటికే బీజేపీ సిట్టింగ్ ఎంపీ బీఎన్ బచ్చేగౌడ కుమారుడు శరత్‌బచ్చేగౌడ కాంగ్రెస్‌లో ఉన్నారు. దరిమిలా లోక్‌సభ ఎన్నికల్లో బచ్చేగౌడ కటుంబంపూర్తిగా కాంగ్రెస్‌వైపు వాలే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. చిక్కబళ్ళాపుర లోక్‌సభ టికెట్‌కోసం ఇప్పటికే యలహంక ఎమ్మెల్యే విశ్వనాథ్ కుమారుడు అలోక్, మాజీ మంత్రి డాక్టర్ కే సుధాకర్ తీవ్రంగానే ప్రయత్నిస్తున్నారు. మాజీ సీఎం యడియూరప్ప కూడా డాక్టర్ సుధాకర్ అభ్యర్థిత్వం వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. తాజాగా ఒక వేళ శివశంకర రెడ్డి కూడా ఎంట్రీ ఇస్తే రాజకీయ సమీకరణలు మారిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

భోజనం సరే.. పడక ఇస్తే ఓ కునుకు తీస్తాం

▸▸ శాసనసభలో బీజేపీ సభ్యుడు ఆరగ జ్ఞానేంద్ర చలోక్తి

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అధ్యక్షా ఇంత మంచి భోజనం పెట్టాక కునుకు రాక మానుతుందా? కాస్త పడక అవీ సమకూరిస్తే సుఖంగా ఉంటాం... అంటూ బీజేపీ సభ్యుడు ఆరగ జ్ఞానేంద్ర శాసనసభలో సోమవారం చలోక్తి విసిరారు. శాసనసభకు సభ్యులు గైర్హాజరు కాకుండా చూసేందుకు స్పీకర్ యుటీ ఖాదర్ పలు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం సభ్యులకు అల్పాహారం, మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పించారు. సభ్యులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్నం భోజనం కోసం వెళుతున్న సభ్యు లు మళ్ళీ సభలో కనిపించడం లేదని అందుకే నగరంలోనే భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 10.15 గంటలకే సభా కార్యకలాపాలు ప్రారంభం కావడంతో సభ్యులందరికీ అల్పాహారాన్ని ఉచితంగా అందజేశారు. మధ్యాహ్నం భోజనసదుపాయం కూడా కల్పించారు. ఇంత చేసినా సభలో మధ్యాహ్నం తర్వాత సభ్యుల హాజరు శాతం తక్కువగానే కనిపించింది.

సీఎంకు అనారోగ్యం

కాగా తీరిక లేకుండా జిల్లా పర్యటనల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు గొంతునొప్పి రావడంతో విశ్రాంతి తీసుకోవాల్సిందిగా వైద్యులు సూచించారు. ఉదయం ఒకటి అరా కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం అనంతరం తన నివాసం కావేరికి వెళ్ళిపోయారు. శాసనసభా కార్యక్రమాలకు కూడా ఆయన హాజరు కాలేదు. ఒకటి రెండు రోజుల విశ్రాంతి అవసరమనివైద్యులు సీఎంకు చెప్పినట్లు సమాచారం.

చింతామణిలో కేఆర్ఎస్ జాతా



బెంగళూరు సర్కిల్‌లో కేఆర్ఎస్ కార్యకర్తల సందడి

చింతామణి, ఫిబ్రవరి 19: కర్ణాటక కోసం మేము... అనే పేరిట రాష్ట్ర వ్యాప్తంగా 13 రోజులపాటు 3వేల కిలోమీటర్ల సాగే కేఆర్ఎస్ జాథా సోమవారం చింతామణికి చేరింది. ఉదయం దేవనహళ్ళిలో ప్రారంభమైన బైక్ జాథా మధ్యాహ్నం సుమారు 2.30 గంటలకు చింతామణికి చేరింది. పట్టణం లోని బెంగళూరు సర్కిల్‌లో ప్రజలను ఉద్దేశించి కేఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సంఘ టనా కార్యదర్శి ఆరోగ్యస్వామి మాట్లాడారు. అవినీతి, స్వజనపక్షపాతం, పాల నలో అక్రమాల ద్వారా ప్రజలకు నిరంతరం ద్రోహం చేస్తున్న జాతీయ పార్టీ లైన కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్‌లను తిరస్కరించాలన్నారు. రాష్ట్రంలో ఏకైక ప్రామాణిక, ప్రాంతీయ పార్టీ కర్ణాటక రాష్ట్ర సమితి (కేఆర్ఎస్)ను ఆదరించాలన్నారు. స్వచ్ఛ, ప్రామాణిక, ప్రజలకోసం పాటుపడే రాజకీయ నాయకుల గురించి జాగృతి కల్పించేలా బైక్‌జాథా చేపట్టామన్నారు. కేఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రవికృష్ణారెడ్డి నేతృత్వంలో ప్రామాణిక రాజకీయ వ్యవస్థ కోసం పార్టీ బలోపేతం కోసం నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. బైక్ జాథాలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దీపక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగేగౌడ, రాష్ట్ర కార్యదర్శి రఘు జాణగెరె, మల్లికార్జున్ భట్టరహళ్ళి, నరసింహమూర్తి, మంజునాథ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రఘుపతిభట్, రాష్ట్ర సంఘటనా కార్యదర్శి ఎల్ జీవన్, చిక్కబళ్ళాపుర జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హాప్‌కామ్స్‌లో ద్రాక్షమేళా

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఉద్యానవనాలశాఖకు అనుబంధమైన హాప్‌కామ్స్‌లో ఆయా సీజన్‌లకు అనుగుణంగా మేళాలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా నగరంలోని హడ్సన్ సర్కిల్‌లోని హాప్ కామ్స్‌లో ద్రాక్ష, పుచ్చకాయ మేళాను సోమవారం రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. మేళాలో భాగంగా 10శాతం రాయితీతో ఈనెల 29వరకు విక్రయాలు ఉంటాయని హాప్‌కామ్స్ ఎండీ ప్రకటించారు. బెంగళూరు నీలి, థామ్సన్ సీడ్‌లెస్, టీఎస్, టీజీ, సోనాక, సూపర్ సోనాక, శరద్, ఇండియన్ రెడ్‌గ్లోబ్, తదితర రకాల ద్రాక్షలు మేళాలు ఉన్నాయన్నారు. సాధారణ రకం కిలో రూ.50 నుంచి ఫ్లేమ్ రకం కిలో రూ.255 దాకా అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే నామధారి, హాళది రకాల పుచ్చకాయలు కిలో రూ.36-42 మధ్య ధర ఉన్నట్టు తెలిపారు. అన్ని హాప్‌కామ్స్ దుకాణాలలో రాయితీ లభిస్తుందన్నారు. ఉద్యానవన శాఖ పాల్గొన్నారు.



ద్రాక్ష మేళా ప్రారంభంలో మంత్రి రామలింగారెడ్డి తదితరులు

పాత్రికేయుల సమస్యలను పరిష్కరిస్తాం



సమావేశంలో ముఖ్యమంత్రి మీడియా సలహాదారు కేవీ ప్రభాకర్ తదితరులు

కోలారు, ఫిబ్రవరి 19: పత్రికా ప్రతినిధిగా ఎన్ని ఉన్నత హోదాలు పొందినా తాను ఎదిగేందుకు కారణమైన మార్గాన్ని మరిచేది లేదని ముఖ్యమంత్రి మీడియా సలహాదారుడు కేవీ ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. ఈసారి బడ్జెట్‌లో గ్రామీణ పాత్రికేయులకు ఉచిత బస్‌పాస్ సదుపాయం ప్రకటించడంపై కోలారు పాత్రికేయుల సంఘం ఆధ్వర్యంలో సన్మానం స్వీకరించి మాట్లాడారు. తాను కోలారులో పాత్రికేయుడిగా పనిచేస్తున్న వేళ అంతరగంగె కొండకు తరచుగా వెళ్లేవాడినన్నారు. కొండ ఎక్కాక తాను వచ్చిన మార్గాన్ని వెనుతిరిగి చూసుకునేవాడినన్నారు. మార్గంలో ఎన్నో ఎత్తుపల్లాలు ఉన్నట్టే జీవితంలోనూ ఒడిదుడుకులు ఎదుర్కొన్నానన్నారు. కాగా గ్రామీణ పాత్రికేయుల సేవను గుర్తించి ఉచిత బస్ సదుపాయాన్ని ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. పాత్రికేయుల సమస్యలపై ముఖ్యమంత్రికి పూర్తి అవగాహన ఉందన్నారు. రిటైరైన పాత్రికేయులకు నెలవారీ ఇచ్చే రూ.3వేలను రూ.12వేలకు సీఎం పెంచారన్నారు. ఈ మొత్తాన్ని దశలవారీగా రూ.25వేలకు పెంచాలన్నది తన లక్ష్యమని ఇందుకు నిరంతరం శ్రమిస్తానన్నారు. బడ్జెట్‌లో ముఖ్యమంత్రి ప్రకటించినట్టుగా ఉచిత బస్ సదుపాయాన్ని అర్హులకు అందేలా మీడియా సంఘాలు తగిన చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పాత్రికేయుల సంఘం ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కుమార్, జిల్లా పాత్రికేయుల సంఘం అధ్యక్షులు పదాదికారులు పాల్గొన్నారు.

కైవార డెయిరీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవం

చింతామణి రూరల్, ఫిబ్రవరి 19: తాలూకాలోని కైవార పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం పాలకమండలికి ఐదేళ్ల అవధికి సోమవారం జరిగిన ఎన్నికల్లో బీజేపీ-జేడీఎస్ మైత్రి అభ్యర్థులు విజయం సాధించారు. అధ్యక్షులుగా నరసింహమూర్తి, ఉపాధ్యక్షులుగా బనహళ్ళి టీజీ మంజునాథ్ ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఎన్ వనితా ప్రకటించారు. అనంతరం నూతన ఉపాధ్యక్షుడు మంజునాథ్ మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్‌ల అందరి అభిప్రాయాలతో సంఘాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వ సౌలభ్యాలను పాడిరైతులకు అందేలా పాటుపడ తామన్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు బనహళ్ళి రవి, తమ్మేగౌడ, పుట్టరాజు, బీఎన్ నారాయణస్వామి, శివానంద, బీఎం రవీంద్ర, విశ్వనాథ్, జీ మునిరత్నమ్మ, గాయత్రి, వెంకటస్వామి, నంజుండగౌడ తదితరులు పాల్గొన్నారు.



నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

అశ్వమేధ క్లాసిక్ బస్సు సర్వీసులకు శ్రీకారం



అశ్వమేధ బస్సు సర్వీసులకు ఎమ్మెల్యే పచ్చజెండా

బాగేపల్లి, ఫిబ్రవరి 19: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అశ్వమేధ క్లాసిక్ బస్సు సర్వీసులకు ఎమ్మెల్యే సుబ్బారెడ్డి పచ్చజెండా చూపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం ఏర్పాటైన కార్యక్రమంలో 3 బస్సు సర్వీసులను ప్రారంభించారు. డిపోకు కనీసం 5 బస్సులు కావాలని డిమాండ్ ఉండగా 3 బస్సులు అందుబాటులోకి వచ్చాయని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. బాగేపల్లి నుంచి బెంగళూరుకు నాన్‌స్టాప్ సర్వీసులైన ఈ బస్సులలో సెన్సార్‌తో పనిచేసే వాకిళ్ళు, ఎమర్జెన్సీ బటన్, వాటర్ బాటిల్ పెట్టుకునే సదుపాయం ఉంటాయన్నారు. నాన్ ఏసీ సర్వీసులైన ఈ బస్సులలో జీపీఎస్, రెండు రేర్ కెమెరా వ్యవస్థ ఉన్నాయని, మొబైల్ ఫోన్ చార్జింగ్ 6 పాయింట్‌లు ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో చిక్కబళ్ళాపుర విభాగం డీసీ హిమవర్ధన్ నాయుడు, డీటీఓ మంజునాథ్, డీఎంఈ మల్లికార్జున, బాగేపల్లి డిపో మేనేజర్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ప్రమాదకర కొమ్మల తొలగింపు

▸▸ స్థానికుల హర్షం

చింతామణి, ఫిబ్రవరి 19: పట్టణంలో రద్దీ ప్రదేశమైన అంజని లే అవుట్ మెయిన్ రోడ్డులో వ్యవసాయశాఖ సహాయక డైరెక్టర్ కార్యాలయం ముందున్న ఎన్నో ఏళ్లనాటి చెట్టుకొమ్మ ప్రమాదకరంగా ఉండడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. నగరసభ కమిషనర్ చలపతి నేతృత్వంలో అటవీ శాఖ అధికారులు సోమవారం కార్యాచరణ నిర్వహించారు. నగరసభ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రాంటుకింద సుమారు రూ.55 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పలు వార్డులలో సీసీ రోడ్డు, డాంబరీకరణ పనులు సాగుతున్నాయి. అయితే రద్దీ ప్రదేశమైన ఈ మార్గంలో చెట్టుకొమ్మ ప్రమాదకరంగా ఉందన్న ఫిర్యాదులతో అధికారులు స్పందించారు. అటవీశాఖ అధికారులు స్పందించి ప్రమాదకరమైన చెట్టుకొమ్మలను తొలగించి సంచారం సజావుగా సాగేలా చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కొన్ని రోజులక్రితం సమస్యపై పలువురు లిఖితపూర్వక ఫిర్యాదు చేయగా నగరసభ కమిషనర్ స్పందించి తగిన చర్యలు తీసుకున్నారు.



కొమ్మలను తొలగిస్తున్న సిబ్బంది

రహదారుల మర్మతుల కోసం

ప్రతి నియోజకవర్గానికి రూ.10 కోట్లు

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర పరిధిలోని మొత్తం 28 శాసనసభా నియోజకవర్గాల్లో రహదారులు మర్మత్తుల కోసం తలా రూ.10 కోట్లను విడుదల చేయనున్నట్లు జిల్లా ఇన్‌చార్జిగా ఉన్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. సచివాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అన్ని నియోజకవర్గాలకు సమానంగా నిధులు కేటాయించామన్నారు. తన విచక్షణా కోటాకింద నిధులను విడుదల చేయాలని నిర్ణయించానని ఈ మేరకు బీబీఎంపీ చీఫ్ కమీషనర్ తుషార్ గిరినాథ్‌కు లేఖ రాశానని చెప్పారు. ప్రస్తుత వేసవి కాలంలో బాగా దెబ్బతిన్న రహదారులను ఈ నిధులతో మర్మత్తులు చేసేందుకు తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇందుకు గాను మొత్తం రూ.280 కోట్లను విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశానన్నారు.

సీఎం వద్ద స్టీరింగ్... బ్రేక్ డీసీఎం చెంత

▸▸ క్లచ్ రాజణ్ణ వద్దే : ప్రతిపక్షనేత కోటా శ్రీనివాసపూజారి

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్య వద్ద స్టీరింగ్ మాత్రమే ఉందని బ్రేక్ డీసీఎం డీకే శివకుమార్, క్లచ్ మంత్రి రాజణ్ణ వద్ద ఉందని విధానపరిషత్ ప్రతిపక్షనేత కోటా శ్రీనివాసపూజారి కాంగ్రెస్ పాలనను బస్సుతో పోల్చారు. సోమవారం పరిషత్‌లో కోటా మాట్లాడుతూ 135మంది మద్దతు ఉందని, పాలనా అనుభవం ఉన్న సీఎం వద్ద స్టీరింగ్ కూడా బాగుందని అయితే ఏం లాభమని ప్రశ్నించారు. బ్రేక్‌లు మాత్రం ఆయన వద్ద లేవన్నారు. బస్సు అప్పగించే వేళ నీకు ఎప్పుడు బ్రేక్ వేయాలో నాకు తెలుసనేలా డీసీఎం సిద్ధంగా ఉన్నారన్నారు. క్లచ్ రాజణ్ణ వద్ద ఉందని, ఎక్సలేటర్ పెంచాలని ప్రయత్నిస్తే మునియప్ప, మహదేవప్పల వద్ద ఉందంటూ ఎద్దేవా చేశారు. ఇదే సందర్భంలో ఉన్నత విద్యాశాఖ మంత్రి సుధాకర్ జోక్యం చేసుకుని మీరు అన్ని బాధ్యతలు ఢిల్లీ వద్ద ఉంచి వచ్చారంటూ ఎద్దేవాచేశారు.

చార్టెడ్ అకౌంటెంట్ల

బెంగళూరు శాఖ అధ్యక్షుడిగా ప్రమోద్ హెగ్డే



బాధ్యతలు స్వీకరించిన ప్రమోద్ హెగ్డే

బెంగళూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భారతీయ చార్టెడ్ అకౌంటెంట్‌ల సంస్థ దక్షిణభారత ప్రాంతీయ మండలి బెంగళూరులో ఆదివారం సమావేశం జరిపింది. ఇందులో బెంగళూరు శాఖ 55వ అధ్యక్షుడిగా ప్రమోద్ ఆర్ హెగ్డే, ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ దివ్యా రాఘవేంద్ర నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షుడిగా మంజునాథ్ ఎం హాళ్యార్, కార్యదర్శిగా కవితా పరమేశ్, కోశాధికారిగా విరూపాక్షప్ప ముప్పణ్ణతోపాటు పలువురు పదాధికారులు పాల్గొని అభినందించారు.

రాజ్యాంగ జాతా రథానికి ఘనస్వాగతం



కళశాలతో స్వాగతిస్తున్న గ్రామస్థులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 19: తాలూకాలోని తుమ్మనహళ్ళి గ్రామంలో తాలూకా పంచాయతీ, సాంఘిక సంక్షేమశాఖ, తుమ్మనహళ్ళి గ్రామపంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో రాజ్యాంగ జాథా రథానికి సోమవారం ఘనస్వాగతం లభించింది. రాజ్యాంగ జాగృతి జాథా రథానికి కుందలగుర్కి గ్రామం నుంచి తుమ్మనహళ్ళికి రాగా గ్రామపంచాయతీ అధ్యక్షురాలు ప్రేమ రమేశ్, ఉపాధ్యక్షులు మారుతి తదితరులు పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. పాఠశాల విద్యార్థులు, వివిధశాఖల అధికారులు, దళిత సంఘాల ప్రముఖులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో గ్రామస్థులు జాగృతి రథాన్ని స్వాగతించారు. జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాజ్యాంగ ఆశయాలను వక్తలు వివరించారు. సాంఘిక సంక్షేమశాఖ అధికారి జగదీశ్, సీడీపీఓ నవతాజ్, కేఎంఎఫ్ డైరెక్టర్ ఆర్ శ్రీనివాస్, గ్రామపంచాయతీ అధ్యక్షులు ప్రేమ రమేశ్, ఉపాధ్యక్షులు మారుతి, పీడీఓ మమతా, ఆర్ శశిధర్, తాలూకా దళిత సంఘర్ష సమితి సంచాలకులు హుజగూరు వెంకటేశ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో న్యాయవాదుల నిరసన



నిరసనలో పాల్గొన్న న్యాయవాదులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 19: రామనగరలో న్యాయవాదిపై కేసు నమోదు చేయడం వెనుక నిషేధిత సంఘం ప్రమేయం ఉందని దీన్ని ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు కోర్టు కార్యకలాపాలను బహిష్కరించి పోరాటం చేయనున్నారని తాలూకా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం నారాయణస్వామి వెల్లడించారు. తాలూకా న్యాయవాదుల సంఘం కార్యాలయంలో సీనియర్ న్యాయవాది అశ్వత్ నారాయణ సమక్షంలో సోమవారం సమావేశం జరిగింది. వారణాసిలో జరిగిన ఘటన నేపథ్యంలో టౌన్ ఎస్ఐ, న్యాయవాదిపై కేసు నమోదు చేశారన్నారు. ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో న్యాయవాదులు సామాన్యులకు కూడా న్యాయం అందించడం, కోర్టు కార్యకలాపాలలో పాల్గొనడం కష్టమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇది సమంజసం కాదన్నారు. నిరసన అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేయనున్నట్టు సంఘం అధ్యక్షుడు ఏ నారాయణస్వామి తెలిపారు.